సాక్షి
నంద్యాల
గురువారం । 3 । ఆగస్టు । 2023



సాక్షి గణపతికి అభిషేకం
శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



వర్షాకాలం .. విద్యుత్‌తో భద్రం
వర్షాలతో పలుచోట్ల విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షా కాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. 8లో



అమ్మ పాలే అమృతం
తల్లిపాలు అమృతం లాంటివి. ఈ పాలలో పోషకాలు, వ్యాధినిరోధక శక్తి ఎక్కువ. ఇవి బిడ్డను జీవితకాలం రక్షించే ఔషధంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నంద్యాలటౌన్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో వాహనచోదకులను హెచ్చరించారు. మైనర్లు, లైసెన్స్ లేనివారు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను ఎస్పీ వెల్లడించారు.

డీసీఓ బాధ్యతల స్వీకరణ



డీసీఓకు బొకే అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): జిల్లా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా ఎం. వెంకట సుబ్బయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో డీఆర్‌డీఏ పీడీగా, డ్వామా పీడీగా, జెడ్పీ సీఈఓగా డిప్యుటేషన్ పై పనిచేశారు. డిప్యుటేషన్ పూర్తికావడంతో తిరిగి మాతృశాఖకు బదిలీ అయినట్లు వెంకట సుబ్బయ్య తెలిపారు. డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ డీసీగా డాక్టర్ భాస్కరరెడ్డి

- నంద్యాల జిల్లాకు డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి నియామకం

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కర్నూలు జిల్లా డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉలిందకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా ఉన్న ఆయనను ఫారెన్ సర్వీస్ కింద ఆరోగ్యశ్రీకి పంపించారు. అలాగే నంద్యాల జిల్లాకు ఇప్పటి వరకు డీసీ పోస్టు లేదు. అక్కడ కూడా డీసీ పోస్టును క్రియేట్ చేసి తిమ్మాపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డిని డీసీగా నియమించారు.

ఆలిండియా కోటాలో మెడికల్ సీట్ల కేటాయింపు

నంద్యాలటౌన్: త్వరలో ప్రారంభం కాబోతున్న నంద్యాల వైద్య కళాశాలలో ఆలిండియా కోటా నుంచి ముగ్గురు విద్యార్థులకు మెడికల్ సీట్లు కేటాయించారు. ఈ విషయాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత బుధవారం తెలిపారు. కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయని, త్వరలోనే బోధనా తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

29 నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

- సమీక్ష నిర్వహించిన శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించున్నారు. ఉత్సవాల నిర్వహణపై శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు.. ఆశీర్వాద గదిలో మేనేజర్లు, నిర్వాహకులతో ముందస్తుగా సమావేశమయ్యారు. వేడుకలు ఘనంగా జరపాలని శ్రీమఠం అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ఉత్సవాల కోసం 25 శాతం విరాళాలు సేకరించాలని అందులో 10 శాతం నిధులు వేడుకలకు వెచ్చించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రసీదులు, ఖర్చులపై నిర్దిష్ట లక్ష్యాలను అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆరాధన ఉత్సవాల ఏర్పాట్లపై ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు లేఖలు సమర్పించినట్లు చెప్పారు. సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, వివిధ శాఖల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం రిజర్వాయర్‌కు 1,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక గేటును ఎత్తి దిగువకు 886, కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 1.20 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 1.068 టీఎంసీల మేరకు నీరు ఉందని డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



నందికొట్కూరు పట్టణంలోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్షయవ్యాధి నిర్ధారణ పరికరాలు



అవగాహన మంత్రం.. నియంత్రణ లక్ష్యం

- జిల్లాలో తగ్గుతున్న క్షయ వ్యాధి బాధితులు
- పెరిగిన శ్యాంపిళ్ల సేకరణతో వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట
- ఆశా కార్యకర్తల పర్యవేక్షణలో మందుల వాడకం
- బలవర్ధకమైన ఆహారానికి రోగి ఖాతాలో ప్రభుత్వం నగదు జమ

నందికొట్కూరు: క్షయ వ్యాధి మహమ్మారిని నియంత్రించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఓ వైపు అవగాహన కార్యక్రమాలు మరో వైపు రోగులను గుర్తించి నాణ్యమైన మందులు అందజేయడం, ఇంకో వైపు త్వరగా కోలుకునేలా పౌష్టికాహారానికి ఆర్థిక సాయం అందజేయడం వంటి కార్యక్రమాలతో క్షయ వ్యాధిని నియంత్రిస్తున్నారు. జిల్లా జనాభా ప్రాతిపదికన నమోదు కావాల్సిన కేసుల కంటే తక్కువ కేసులు ఉండటం అధికార యంత్రాంగానికి ఊరటనిస్తోంది. జిల్లాలోని నలమల్ల అటవీ ప్రాంతం, మైనింగ్ ప్రాంతాల్లో క్షయ వ్యాధి (టీబీ) కేసులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలోని నంద్యాల ఆస్పత్రిలో టీబీ యూనిట్‌లో అధునాతనమైన సీబీ నాట్, ట్రూనాట్, మైక్రోస్కోపి ద్వారా నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్క రోజు వ్యవధిలోనే ఫలితాలు వస్తున్నాయి. దీంతో సత్వర వైద్యం పొందే అవకాశం ఏర్పడింది. గతంలో వ్యాధి నిర్ధారణ ఆలస్యం కావడం, రోగులకు ఒకేసారి ఆరు నెలల మందులు ఇవ్వడంతోనే సరిపెట్టే వారు. ప్రస్తుతం ప్రతి నెలా పర్యవేక్షణతో రోగి కోలుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఆశావర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలు వెంటనే ఆస్పత్రులకు తీసుకువచ్చి కఫం (గళ్ల) పరీక్ష, ఎక్స్‌రే పరీక్ష చేయిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ తరువాత రోగి మందులను ఆశా వర్కర్‌కే అప్పజెబుతున్నారు. ఆమె క్రమం తప్పకుండా దగ్గరుండి మందులు వేయించడం, ప్రతి నెల సమీపంలోని ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు చేయించడంతో రోగి త్వరగా కోలుకుంటున్నాడు. ఆ నెలలో రోగి యొక్క రోగ తీవ్రతను బట్టి ఆ నెలలో వాడాల్సిన మందులను ఆస్పత్రిలో వైద్యులు ఇస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహించే 104 వైద్య శిబిరాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ఆయా గ్రామాల్లో ఉండే క్షయ రోగుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇందుకు ఒక్కో రోగికి రూ. వెయ్యి చొప్పున ఆశా వర్కర్ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. ప్రజల్లో క్షయ వ్యాధిని గుర్తించిన వారికి, ప్రైవేటు వైద్యులకు కూడా ఒక్కో కేసుకు రూ. 500 చొప్పున ప్రోత్సాహం అందజేస్తోంది.



ఆత్మకూరు మండలం బైర్లూటి చెంచుగూడెంలో క్షయపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో టీబీ కేసుల నమోదు ఇలా

సంవత్సరం	గళ్ల పరీక్ష	కేసులు
2019	15,162	1,945
2020	22,879	1,560
2021	29,757	2,016
2022	33,932	1,927
2023 (ఇప్పటి వరకు)	17,260	9,94

రోగులకు అండగా..

నలమల్ల అటవీ, నాపరాతి గనుల ప్రాంతాల్లో గతంలో టీబీ వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తికి ఐటీడీఏ ద్వారా రాగిమాల్ట్, రాజ్‌మా, కందిపప్పు గుడ్లు తదితర పౌష్టికాహారం సరుకులు ఇచ్చేవారు. అయితే ఇవి సకాలంలో అందేవి కావు. ప్రస్తుతం ప్రభుత్వం టీబీ వ్యాధి బారిన పడిన వారికి పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెల రూ.500 చొప్పున ఆరు నెలల పాటు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. ఇదే కాకుండా గిరిజన ప్రాంతాల్లో క్షయ రోగులకు అదనంగా రూ.750 ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుంది.

రోగుల ఇళ్లకు పోచా పౌష్టికాహారం కిట్లు..

జిల్లాలో 150 మంది రోగులకు ఆరు నెలల పాటు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ మేరకు రూ. 4.50 లక్షల చెక్కును జిల్లా క్షయ నివారణ విభాగం అధికారులకు అందజేయగా, వారి ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేశారు. రూ. 500 విలువ చేసే కిట్లలో పల్లీలు, బెల్లం, శనగలు, నూనె, కంది పప్పు ఉన్నాయి. రోగి త్వరగా కోలుకునేందుకు ప్రభుత్వ సాయంతో పాటు ఎంపీ పోచా దాతృత్వం ఎంతో ఆదుకుంది. ఎంపీతో పాటు మరి కొంత మంది వైద్యులు కూడా పేద రోగులకు పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకున్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాను



క్షయ లక్షణాలు ఉండటంతో ఆశా కార్యకర్త ఆత్మకూరు ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. వ్యాధి నిర్ధారణ కావడంతో వైద్యులు మందులు ఇచ్చారు. వీటిని ఆశా వర్కర్ పర్యవేక్షణలో వాడాను. ఆరు నెలలకు నా బ్యాంకు ఖాతాలో పౌష్టికాహారం నిమిత్తం రూ.3,750 జమ చేసింది. మంచి ఆహారం తీసుకోవడంతో క్షయ పూర్తిగా నయమైంది.
– అంకన్న పెచ్చెరువు గూడెం, ఆత్మకూరు మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిత్యం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు కూడా వైద్యులు, సిబ్బంది రోగులను పర్యవేక్షిస్తున్నారు. మందులు, పౌష్టికాహారం అందజేస్తుండటంతో జిల్లాలో క్షయ వ్యాధి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. – శారద బాయి, జిల్లా క్షయ, కుష్టు నివారణ విభాగం అధికారి, నంద్యాల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కొండుపల్లె ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించి మాట్లాడుతున్న డీఈఓ

ఉయ్యాలవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండుపల్లె, ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పై పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నాడు నేడు కింద చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు పాఠశాలల్లో ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామన్నారు. కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి విద్యార్థులు వర్క్ బుక్‌లో రాసిన వాటిని పరిశీలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. అలాగే పాఠశాలలో నాడు –నేడు పనులు నిర్ణీత సమయంలో పూర్తి అయ్యేలా పర్యవేక్షించడంలో అలసత్వం వహించిన ప్రధానోపాధ్యాయుడు నరసింహుడుకు కూడా నోటీస్ ఇచ్చినట్లు డీఈఓ వెల్లడించారు. అనంతరం ఉయ్యాలవాడలో బుడ్డా విశ్వనాథరెడ్డి ఇంటికి వెళ్లి దివంగత బుడ్డా వెంగళరెడ్డికి అప్పట్లో విక్టోరియా మహారాణి బహూకరించిన బంగారు పతకాన్ని పరిశీలించి, నాటి చరిత్రను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట సర్వశిక్షా అభియాన్ ఏఎంఈఓ రఘురామిరెడ్డి, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్, పోలీసులు, ప్రజలు



సురేంద్ర మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఆర్మీ అధికారులు, పోలీసులు

సెల్యూట్.. సురేంద్ర!

- వీర జవాన్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు
- జై జవాన్ అని నినదించిన అధికారులు, సైనికులు
- అంత్యక్రియలకు భారీగా హాజరైన ప్రజలు
- అవకాశం ఇస్తే పెద్దబ్బాయిని కూడా ఆర్మీకి పంపుతామన్న తల్లిదండ్రులు

పాములపాడు: ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ శిరిగిరి సురేంద్రకు అధికారులు, సైనికులు సెల్యూట్ చేశారు. దేశ రక్షణలో సురేంద్ర సేవలను కొనియాడారు. బారాముల్లాలో విధులు నిర్వహిస్తూ జూలై 31వ తేదీన సురేంద్ర వీర మరణం పొందారు. మృతదేహాన్ని మంగళవారం అర్ధరాత్రి స్వగ్రామమైన కృష్ణానగర్‌కు తీసుకొచ్చారు. బుధవారం ఉదయం గ్రామంలోని శ్మశాన వాటికలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియలకు గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. జై జవాన్ అంటూ నినదించారు. దేశానికి సురేంద్ర చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. వివరాలు వారి మాటల్లోనే..

రద్దీ ప్రాంతంలో కాల్పులు జరిగాయి



బారాముల్లా జిల్లా కేంద్రంలోని మార్కెట్ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం అది. జులై 31వతేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు అనుకోకుండా కాల్పులు జరిగాయి. ఆ సమయంలో ఆరుగురు జవాన్‌లు విధుల్లో ఉన్నారు. ఒక్కొక్కరు ఒక చోట ఉన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు.
–ఎంఎం రెడ్డి, సుబేదార్, బారాముల్లా

మంచి మిత్రుడు



మా సొంత ఊరు డోన్. సురేంద్ర నేను ఇద్దరం ఒకే సారి ఆర్మీలో చేరాం. నాకు మంచి మిత్రుడు. అందరితో కలివిడిగా ఉండేవాడు. నవ్వుతూ పలకరించేవాడు. మార్కెట్‌లోకి డ్యూటీకి వెళ్లినప్పుడు నేను కంపెనీలోనే ఉన్నాను. కాల్పుల్లో రమణించాడనే వార్త తెలిసి నివ్వెరపోయాను. సురేంద్ర చనిపోయాడంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.
–మాదవ క్రిష్ణ, జవాన్, బారాముల్లా

అవకాశం ఇస్తే పెద్దబ్బాయిని కూడా ఆర్మీకి పంపుతాం



మా కుమారుడు దేశం కోసం ప్రాణాలు వదిలాడు. కుమారుడు లేని లోటు తీర్చలేది. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే పెద్దబ్బాయి సుమన్‌ను కూడా ఆర్మీకి పంపడానికి మేం సిద్ధంగా ఉన్నాం.
–సుబ్బయ్య, సుబ్బమ్మ, తల్లి దండ్రులు

ఆప్తున్ని కోల్పోయాం



సురేంద్ర నాకు చిన్నప్పటి నుండి మంచి మిత్రుడు, బంధువు కూడా. ఆర్మీ నుంచి సెలవుల్లో గ్రామానికి వచ్చినప్పుడు కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవాడు. కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపేవాడు. ఎక్కడ పడితే అక్కడ తిరిగేవాడు కాదు. మంచి ఆప్తున్ని కోల్పోయాం. –అశోక్, మిత్రుడు, కృష్ణానగర్

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- బోగస్ ఓట్ల తొలగింపునకు చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

నంద్యాల: తప్పులు లేకుండా అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో పుల్లయ్య అన్నారు. జాబితా తయారీకి ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 21 వ తేదీ నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలు బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించి సర్వేకు సహకరించాలన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన ఓటర్లు ఎవరైనా ఉంటే గుర్తించి వారి పేర్లను తొలగించాలని చెప్పారు. అలాగే మార్పులు, చేర్పులు తొలగింపులు, స్త్రీ, పురుష నిష్పత్తి, బోగస్ ఓట్లు, ఒకే ఇంట్లో 10 కి మించి ఓట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు బోగస్ ఓట్ల తొలగింపుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు అనిల్ అమృతరాజ్, సాయిరాంరెడ్డి, బీజేపీ నుంచి ఎం. గంగాధర్, సీపీఐ నుంచి ఎన్. రంగనాయుడు, సీపీఐఎం నుంచి రమేష్ కుమార్, కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాష, తెలుగుదేశం నుంచి నరేంద్ర కుమార్‌తో పాటు అన్ని నియోజకవర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

ప్రకృతి సోయగం

సాయం సంధ్య వేళ..చీకట్లు ముసురుకుంటున్న సమయం.. ఆకాశం, పచ్చటి చెట్టు ప్రతిబింబించి కనువిందు చేశాయి. కళాకారుడు చిత్రించినట్లుగా ఉన్న ఈ ప్రకృతి సోయగం బుధవారం మహానంది సమీపంలోని పంటపొలాల్లో కనిపించింది. – మహానంది



ప్రభుత్వ నిర్ణయంపై హర్షం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

నంద్యాలటౌన్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులను 010 పద్దులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఏళ్ల నాటి కల నెరవేరింది. ఈ నేపథ్యంలో వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు గిరి శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ 2014 జూలై కంటే ముందు నుంచి పని చేస్తున్న ప్రతి ఒక్క కాంట్రాక్టు ఉద్యోగిని సర్కారు రెగ్యులర్ చేసిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సదుపాయాలు లభిస్తాయన్నారు.

ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు

- విలేకరుల సమావేశంలో జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): రాయలసీమలోని ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బీడు వారిన సీమ భూములు నేడు పచ్చని పంటపొలాలతో కళకళలాడుతున్నాయంటే దివంగత వైఎస్సార్ చలువేనన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుండ్రేవుల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నయాపైసా కేటాయించకుండా 2019 ఎన్నికల సమయంలో హడావుడిగా డీపీఆర్‌లు మాత్రం చంద్రబాబు రూపొందించారన్నారు. వైఎస్సార్ చేపట్టిన 'జలయజ్ఞం' పనులకు అనేక రూపాల్లో అడ్డంకులు సృష్టించారన్నారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుకు వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులకు ఇప్పటికే రూ.3100 కోట్లు వెచ్చించారన్నారు. గతంలో పోతిరెడ్డిపాడు నుంచి 11 వేల క్యూసెక్కులు మాత్రమే డ్రా చేసుకునే అవకాశం ఉండేదన్నారు. అది వైఎస్సార్ హయాంలో 44 వేల క్యూసెక్కులకు పెరిగిందని, ప్రస్తుతం 80 వేల క్యూసెక్కుల నీటిని డ్రా చేసుకునేందుకు వీలుగా రూ.1,700 కోట్ల వ్యయంతో జరుగుతున్న విస్తరణ పనులు చంద్రబాబుకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వర్షాకాలంలో కుందూ నదికి వరదలు వచ్చిన సందర్భాల్లో జరుగుతున్న పంట నష్టాలను నివారించడం కోసం రూ.1,400 కోట్లతో జరుగుతున్న విస్తరణ పనులు వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. గోరుకల్లు రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ, గాలేరు – నగరి లైనింగ్ పనులు దాదాపు 50 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటి మట్టం ఉన్నా, సాగు తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ' ముందుకు వెళ్లకుండా ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్)లో టీడీపీ నేతలు కేసులు వేశారని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమ అభివృద్ధి కోసం ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని, కేవలం ప్రజలను మభ్య పెట్టేందుకు అబద్ధాలు మాట్లాడితే సహించరన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క ప్రాజెక్టునైనా ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఆయన చేసిన తప్పులకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

క్లుప్తంగా

గెస్టు ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని బాలుర ఉర్దూ జూనియర్ కాలేజీలో గెస్టు ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జువాలజీ, బయాలజీ పోస్టులతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 7వ తేదీన ఇంటర్వ్యూ, డెమోలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్: 8712625080ను సంప్రదించవచ్చన్నారు.

9 నుంచి అజాదికా అమృత్ వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 9 నుంచి 15 వరకు అజాదికా అమృత్ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 'నా భూమి-నాదేశం', 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలు జరిపేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసినట్లు డ్వామా పీడీ అమరనాథరెడ్డి విలేఖర్లకు తెలిపారు. వేడుకల సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటుతామని చెప్పారు. అన్ని పంచాయతీల్లో శిలాఫలకం కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆగస్టు 9న శిలాఫలకాలను జాతికి అంకితమివ్వడం, 10న పంచప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం, 14న వీరులకు వందనం, 15న జాతీయ పతాకాన్ని ఎగుర వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాముకాటుకు గురై విద్యార్థికి అస్వస్థత

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామంలో నారాయణ, లక్ష్మీ దంపతుల కుమారుడు భార్గవ్ అనే విద్యార్థి బుధవారం ఉదయం పాముకాటుకు గురైయ్యాడు. భార్గవ్..స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. మలవిసర్జన చేసేందుకు పాఠశాల ఆవరణలో ఉన్న బాత్ రూమ్ దగ్గరకు వెళ్లాడు. ఆ ప్రాంతంలో విదార్థికి పాము కాటు వేసింది. వెంటనే విద్యార్థి అరుపులు వేయడంతో పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్ నాయక్ వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చాడు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ-2 నాగేశప్ప ఆదోని హాస్పిటల్‌కు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నాడు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

అమ్మ పాలే అమృతం!

- శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలివ్వాలి
- ముర్రు పాలతో వ్యాధి నిరోధక శక్తి
- బిడ్డ ఎదుగుదలకు ఎంతో మేలు
- బాలింతలకు తల్లి పాల ప్రాధాన్యతను వివరిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు
- 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు


తల్లిపాలపై బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఈ సృష్టిలో జన్మించిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివి. ఈ పాలలో మాతృప్రేమతో పాటు పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. ఇవి బిడ్డను జీవితకాలం రక్షించే ఔషధం. అయితే, కొందరు తల్లులు ఉరుకులు, పరుగుల జీవితంతో, మరికొందరు నిర్లక్ష్యంతో బిడ్డకు పోతపాలు పడుతుంటారు. దీని వల్ల ఆ శిశువు సంపూర్ణంగా ఎదగదు. తల్లిపాల విలువను సమాజానికి తెలియజెప్పేందుకు గాను ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుంచి 7వ తేది వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 26 అర్బన్‌హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ప్రతి సంవత్సరం 48వేల నుంచి 62వేల మంది ప్రసవిస్తుంటారు. గత సంవత్సరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 61,450 మంది ప్రసవించారు. ప్రసవం అయ్యాక ఆయా ఆసుపత్రుల్లో శిశువులకు గంటలోపు తల్లిపాలను వైద్య సిబ్బంది పట్టిస్తుంటారు. ఈ పాల ఆవశ్యకతపై బాలింతలకు వైద్యులు, నర్సులు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లి పాలు ఎలా పట్టాలంటే...

బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే పదార్థాలూ ఇవ్వకూడదు. తల్లిపాలు బిడ్డకు తేలికగా జీర్ణమవుతాయి. తల్లి పాలు ఎంతో స్వచ్ఛంగా, ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జి, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు లేదా ప్రతి రెండు నుంచి మూడు గంటలకు ఒకసారి తల్లిపాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీంతో ఎదిగే బిడ్డకు ఎలాంటి వ్యాధులు దరిచేరవు.

ఇవి తీసుకోకూడదు..

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకూడదు ఇది శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

పాలు పుష్కలంగా రావాలంటే...

గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీట్లు) తీసుకోకుండా ప్రకృతి సహజంగా లభించే పండ్లు తినాలి.

తల్లిపాలతో కలిగే ప్రయోజనాలు

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3, ఒమెగా 6, ఒమెగా 9 బిడ్డ మెదడుకు వికాసానికి తోడ్పడుతాయి.
- ఈ పాలలో బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని లాక్టోజ్‌తో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటు వ్యాధుల బారి నుంచి కాపాడుతాయి. బిడ్డలకు డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండెవ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- అలర్జి, ఆస్తమా, డయాబెటీస్ వంటి వ్యాధులు రావు
- బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి



గర్భిణీ ప్రసవించిన తర్వాత మొదటి అరగంటలోపు తల్లికి వచ్చే పాలను ముర్రుపాలంటారు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. చాలా మంది ఈ పాలను బిడ్డకు తాగించకుండా నిర్లక్ష్యం చేస్తారు. ఇందులో వ్యాధినిరోధకశక్తి పెంచే గుణం ఉంటుంది. బిడ్డకు చాలా రకాల వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడతాయి. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు. తల్లిపాలు తాగే పిల్లల్లో ఆకస్మిక మరణాలు తక్కువే.

–డాక్టర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, చిన్నపిల్లల స్పెషలిస్టు వైద్యులు, డోన్ క్లస్టర్

తల్లిపాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు



జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నాము.దీనిపై ఇప్పటికే వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశాము. ఈ సంవత్సరం సందేశం 'ఉద్యోగునిలైన తల్లులు వారి బిడ్డకు తల్లి పాలు కొనసాగించేందుకు సహకరిద్దాం'. ఈ నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లిబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

మైనారిటీ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కర్నూలు(అర్బన్): మైనారిటీ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందిస్తున్నట్లు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఎస్ అయ్యూబ్‌హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ప్రారంభమయ్యే బ్యాచ్ కోసం ఈ నెల 17వ తేదిలోగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ఉర్దు అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లలో ఎక్కడైనా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 3వ వారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. 10వ తరగతి పాసై 40 సంవత్సరాల లోపు స్త్రీ, పురుషులు అర్హులన్నారు. మైనారిటీలతో పాటు ఇతర కులాలకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉర్దూ భాష చదవడం, రాయటం వచ్చిన వారికి కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తామని, ట్రైనింగ్ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. శిక్షణా కాలం మూడు నెలలు ఉంటుందని, మరిన్ని వివరాలకు ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ లైబ్రరీ కంప్యూటర్ సెంటర్, బాల భవనం పక్కన, చిల్డ్రన్స్ పార్కు, కర్నూలు, సెల్: 9391775902 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నియోజకవర్గాలకు ఎన్నికల అధికారుల నియామకం

కర్నూలు (అర్బన్) : రాష్ట్రంలో 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తొలి అడుగు పడింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. విశాఖపట్నంలో ఈనెల 2, 3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లతో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల అధికారులను నియమించారు.

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల అధికారులు వీరే...

నియోజకవర్గం పేరు	ఎన్నికల అధికారి
ఆళ్లగడ్డ	సబ్ కలెక్టర్/ఆర్‌డీఓ నంద్యాల
శ్రీశైలం	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జీజీ, రైల్వే, నంద్యాల
నందికొట్కూరు	ఆర్‌డీఓ, ఆత్మకూరు
కర్నూలు	మున్సిపల్ కమిషనర్
పాణ్యం	జాయింట్ కలెక్టర్, కర్నూలు
నంద్యాల	జాయింట్ కలెక్టర్, నంద్యాల
బనగానపల్లె	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్‌ఏ, ఎస్‌ఆర్‌బీసీ, నంద్యాల
డోన్	ఆర్‌డీఓ, డోన్
పత్తికొండ	ఆర్‌డీఓ, పత్తికొండ
కోడుమూరు	ఆర్‌డీఓ, కర్నూలు
ఎమ్మిగనూరు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నేషనల్ హైవేస్, కర్నూలు
మంత్రాలయం	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్‌ఏ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3, కర్నూలు
ఆదోని	సబ్ కలెక్టర్, ఆదోని
ఆలూరు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్‌ఏ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-4, కర్నూలు.

డీసీసీబీని మరింత అభివృద్ధి చేస్తాం

- చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి


భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, చిత్రంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

కోడుమూరు: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)ను మరింత అభివృద్ధి చేస్తామని చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి అన్నారు. బుధవారం కోడుమూరులో రూ.74లక్షలతో నూతనంగా నిర్మించతలపెట్టిన సహకార సంఘం భవన నిర్మాణానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీసీబీని లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులు, పొదుపు సంఘాల మహిళలకు విరివిగా రుణాలివ్వడంతోపాటు వ్యవసాయ రంగాల అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తానన్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు, కల్యాణ మండపాలు, ఎరువుల గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో సహకార పరపతి సంఘాలు, బ్యాంకులు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కోడుమూరు సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డీజీఎం సునీల్‌కుమార్, ఏజీఎం వహిదాసుల్తానా, బ్రాంచి మేనేజర్లు వెంకటరమణ, అయ్యస్వామి, కోడుమూరు మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచు మాదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ రెడ్డి, రమేష్ నాయుడు, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, సూర్యనారాయణ, ప్రసాద్, తిమ్మారెడ్డి, లింగన్న, రాఘవేంద్ర, నాగార్జున, బందెనవాజ్, శివరాముడు, మల్లారెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని చెంచుకాలనీకి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు.. వడ్డే మౌలాలి(35) అనే వ్యకి స్థానిక ఓ పెస్టిసైడ్ దుకాణంలో పనిచేస్తాడు. ఈయనకు అప్పులున్నాయి. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది స్థానిక ఆర్‌ఆర్ వెంచర్ వద్ద పురుగుల మందు తాగిపడిపోయాడు. అటు వైపు వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులకు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించారు. ఈ విషయాన్ని బుధవారం కోర్టు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన పూసలపాటి కిరణ్ కుమార్, పఠాన్ ఇలియాస్‌ఖాన్ మంగళవారం వేర్వేరుగా పద్మావతి నగర్ ఏరియాలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచ్చారు. విచారణ జరిపిన న్యాయమూర్తి కిరణ్ కుమార్‌ను 30 రోజులు, పఠాన్ ఇలియాస్‌ఖాన్‌ను 15 రోజులు జైలు శిక్ష విధించినట్లు కోర్టు పోలీసులు తెలిపారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	3,197	8,299
పొద్దుతిరుగుడు	4,239	4,609
ఆముదం	6,019	6,180
వాము	4,220	19,688
ఎండుమిర్చి	10,099	17,201
శనగలు	4,805	5,009
కందులు	5,059	9,459
మొక్కజొన్న	2,009	2,009
మినుములు	7,811	7,861
సోయా చిక్కుడు	4,155	4,155

అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి


మాట్లాడుతున్న కరీమా అంజుమ్

కర్నూలు(సెంట్రల్): పిల్లల మానసిక, శారీరక, సామాజిక అంశాలను దృష్టిలో ఉంచుకుని వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని బెంగళూరుకు చెందిన రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ సభ్యురాలు కరీమా అంజుమ్ సూచించారు. బుధవారం సిల్వర్‌జూబ్లీ బీఈడీ కాలేజీలో ఇంటరాక్టివ్ టీచింగ్ అండ్ యాక్టివ్ లెర్నింగ్ స్ట్రాటజీస్ ఫర్ టీచర్‌ట్రైనీస్ అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి వర్క్ షాపులో ఆమె మాట్లాడారు. ఛాత్రోపాధ్యాయులు బోధనలో వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. బోధనోపకరణాలు, సాంకేతికత, సామాజిక అంశాలను జోడించి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణరెడ్డి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, పురుషుల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కెమిస్ట్రీ అధ్యాపకుడు ఏ.సత్యనారాయణ పాల్గొన్నారు.

తొలిసారిగా బేరియాట్రిక్ సర్జరీ

కర్నూలు(హాస్పిటల్): అధిక బరువుతో బాధపడుతున్న నంద్యాల జిల్లాకు చెందిన బాలాజీకి బేరియాట్రిక్ సర్జరీ చేసిదాదాపు 17 కిలోలు తగ్గించినట్లు స్థానిక జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ వి. సురేష్‌కుమార్ రెడ్డి, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఎం.బాలమురళి తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 45 ఏళ్ల బాలాజీ 107 కిలోల బరువు ఉండటంతో స్థూలకాయం, బీపీ, షుగర్, స్ట్రోక్ సమస్యలతో బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చాడన్నారు. అతనికి బేరియాట్రిక్ సర్జరీ చేసి, 90 కిలోలకు తగించామన్నారు. అతనిలో గ్రెలిన్, లెప్టిన్ హార్మోన్‌ల నియంత్రణ జరిగి మరి కొద్దిరోజులకు 75 కిలోలకు వచ్చాడన్నారు. అతని జీర్ణవ్యవస్థలో మార్పు తీసుకురావడంతో పాటు పొట్టపరిమాణాన్ని కూడా తగ్గించామన్నారు. ఇలాంటి సర్జరీ రాయలసీమలోనే మొదటిది అన్నారు. సమావేశంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఆదిత్య, జనరల్ మేనేజర్ నదీమ్ పాల్గొన్నారు.

పక్కాగా స్పాట్ బిల్లింగ్

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియలో స్పాట్ బిల్లింగ్‌ను పక్కాగా నిర్వహించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చేపట్టిన స్పాట్ బిల్లింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు ఉండరాదన్నారు. మీటర్లు స్కానింగ్ కాని పక్షంలో ఏఈలు, ఏడీఈలు పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని చెప్పారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి


మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ నారపురెడ్డి మౌర్య కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కొత్త ఓటర్లను చేర్పించుకోవడంతోపాటు చనిపోయిన వారిని తొలగించేందుకు అంగీకారం తెలపాలన్నారు. ఓటర్లు తమ చిరునామా, పోలింగ్ కేంద్రాల మార్చుకోవచ్చని సూచించారు. పేర్లు, ఇంటి నంబర్లలో తప్పులు ఉంటే సవరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గాలను కూడా మార్పు చేసుకోవచ్చన్నారు. కాలేజీలకు వెళ్లి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటుహక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. అనంతరం రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలు, సూచనలను వివరించగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఆర్వోను ఆమె ఆదేశించారు.

వర్షాకాలం.. విద్యుత్‌తో భద్రం

- తడి చేతులతో తీగలు తాకితే ప్రమాదం
- స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- విద్యుత్ అధికారుల సూచనలు



కర్నూలు(రాజ్‌విహార్): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ తీగలు తెగిపడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామంలో బీటెక్ చదువుతున్న శేఖర్ (20) అనే విద్యార్థి విద్యుత్ ప్రవాహం ఉన్న తీగ (జీ వైర్) పడటంతో శనివారం మృత్యువాతపడ్డాడు. వర్షాలతో ఆరు బయటే కాదు.. ఇళ్లలో ఉన్న స్విచ్‌లకు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయి. తగిన జాగ్రత్తలు పాటించని పక్షంలో సమస్యలు తలెత్తుతాయని అధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో పని చేసే రైతులు మోటార్లు ఆన్ ఆఫ్ చేసే సమయాల్లో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. వర్షా కాలం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకరాదు.
- అప్పటికే తడిచి ఉన్న వాటిని ముట్టరాదు.
- ప్లాస్టిక్, రబ్బరు ముక్క, పాత టూత్ బ్రష్ సహాయంతో స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయడం మంచిది.
- తడిచిన కర్ర, చెక్క అయినా విద్యుత్ ప్రవహిస్తుంది.
- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- తెగిన, వేలాడుతున్న విద్యుత్ వైర్లను ముట్టుకోరాదు.
- తెగిన విద్యుత్ వైరు వైపు ఎవరనీ వెళ్లనీయకండా చూడాలి. వెంటనే సంబంధిత లైన్‌మ్యాన్ లేదంటే అధికారికి సమాచారమివ్వాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు కాలిపోతే సొంతంగా చేసుకోరాదు.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపైకి అనధికార వ్యక్తులు ఎక్కరాదు.
- సర్వీసు వైర్లు అతుకులు, జాయింట్లు, వదులుగా ఉండరాదు.
- మోటర్ స్టార్టర్లు, వైర్లు నేల మీద పెట్టడం ప్రమాదకరం.
- స్టార్టర్‌కు పై కప్పు తొలగించి వాడడం మంచిది కాదు.
- ఎలుకలు, ఉడుతలు, తీగలపై ఉన్న రబ్బరు/ప్లాస్టిక్ కవరింగ్‌ను కొరికేస్తే స్టార్టర్లు, బాక్సులు తెరిచేటప్పుడు షాక్ వస్తుందో లేదో చేసుకోవాలి.
- ఇల్లు, షాపులు, మోటార్లకు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి.
- తడి ఉన్నప్పుడు పంపు సెట్టును ఆన్ చేయరాదు.
- ప్లగ్గులు పెట్టి మోటర్లు ఆన్ చేయరాదు. తప్పనిసరిగా స్టార్టర్‌ను అమర్చుకోవాలి.
- విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటరాదు.
- స్తంభాలకు ఆధారంగా ఉన్న స్టే వైరును తొలగించడం, వాటికి పశువులను కట్టేయడం సరైంది కాదు.
- పొలంలో పడి ఉన్న తీగలను చేతితో తొలగించడం, పక్కకు జరపడం వంటి చేయకూడదు.
- పొడవైన ఇనుప రాడ్‌లు, బోరు పైపులు, కేసింగ్ పైపులు తీసుకెళ్లేటప్పుడు తీగలకు తాకకుండా జాగ్రత్త పడాలి.
- అక్రమంగా విద్యుత్ తీగలు పెట్టుకొని వాడడం ప్రమాదానికి దారితీస్తుంది.
- ఎవరైన విద్యుత్ షాక్‌కు గురయితే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి, ప్లాస్టిక్ లేదా పొడవాటి కర్రతో ఆ వ్యక్తిని తప్పించాలి.
- సంబంధిత అధికారులతో పాటు 108 లేదా 104 నంబర్లుకు సమాచారం అందించాలి.
- ఐఎస్‌ఐ మార్కు కలిగిన పంపుసెట్టు వాడడం సురక్షితం.
- మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకుంటే విద్యుత్ ఆదా కావడంతో పాటు లో ఓల్టేజీ సమస్య తగ్గుతుంది. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా నివారించవచ్చు.

తడి స్విచ్‌లతో ప్రమాదం



వర్షాలతో స్లాబ్‌లు, గొడల్లోకి నీరు చేరి ఉంటుంది. ఇలాంటి సమయాల్లో స్విచ్ బోర్డుల్లో చెమ్మ ద్వారా విద్యుత్ ప్రవహించి షాక్ కొడుతుంది. ఇలాంటి సమయాల్లో ప్లాస్టిక్ లేదా రబ్బరు పరికరాలతో స్విచ్‌లు వేసుకోవాలి. ఏ సమస్య వచ్చినా సొంతంగా పనుల చేసుకోరాదు. సంబంధిత లైన్‌మ్యాన్, ఏఈల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలి. కనీసం సర్టిఫైడ్ ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాలి.

– ఎం. ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ, కర్నూలు

జాగ్రత్తలు తప్పని సరి



వర్షాలు అధికంగా కురవడంతో స్విచ్‌లకు విద్యుత్ ప్రవాహం జరిగి షాక్ ఇస్తుంటాయి. వర్షాకాలంలో పూర్తయ్యే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలి. కర్రలు అయినా తడిచి ఉంటే సరఫరా వస్తుంది. ఇలాంటప్పుడు రబ్బరు లేదా ప్లాస్టిక్ పరికరాలతో స్విచ్‌లు వేసుకోవడం మంచిది.

–తేళ్ల అజయ బాబు, విద్యుత్ తనిఖీ అధికారి, కర్నూలు.